సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు

ఆరిలోవ: చినగదిలి నార్త్ షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమిటీ సభ్యులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగ, మంచినీరు ఆలయానికి వచ్చిన భక్తులు, పాదాచారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ చైర్మన్ వానపల్లి అప్పారావు మాట్లాడుతూ సాయిబాబా భక్తుడు రామ్ రతన్‌జీ జ్ఞాపకార్థం ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ చలివేంద్రం మే నెలాఖరు వరకు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందిస్తున్న వెంకోజీపాలెం వాసులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం వద్ద గ్రామ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, వాహనచోదకులకు మజ్జిగ అందజేశారు.

భక్తులకు వైద్య సేవలు



మహిళకు వైద్య సేవలు అందిస్తున్న ప్రభుత్వ వైద్యులు, చిత్రంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. సింహాచలంలో కొండ మీద, కొండ కిందన కూడా శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. మహిళా భక్తురాలకు లోబీపీ రావడంతో ఆమెకు డాక్టర్లు ఎస్.పి.నాయక్, డాక్టర్ ఎస్.భాస్కర్ వైద్య సేవలు అందించారు. శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు.

ఆటిజంపై అవగాహన అవసరం



తీరంలో ర్యాలీ చేస్తున్న దివిస్ సంస్థ ప్రతినిధులు

బీచ్ రోడ్డు: చాప కింద నీరులా పెరుగుతున్న ఆటిజంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని దివీస్ సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ సుచిత్ర బాలకృష్ణ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్కేబీచ్‌లో ఆటిజం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆటిజం లక్షణాలు అవగాహనతో మాత్రమే గుర్తించడం సాధ్యమన్నారు. ఆటిజం లక్షణాలను చిన్న వయస్సులోనే గుర్తించి సరైన సహకారం అందిస్తే సమస్య తీవ్రతను చాలా వరకు తగ్గించ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ మధుసూదనరావు, వైస్ ప్రెసిడెంట్ ఎస్.దేవేందర్‌రావు, జీఎం వై.ఎస్.కోటేశ్వరరావు, డాక్టర్ ప్రేరణా చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హేరేరామ నామస్మరణ మార్మోగింది. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ఆరోగ్యం.. ఆహ్లాదం



గ్రీన్‌బెల్ట్‌లో పచ్చని చెట్లు

- అందమైన పార్కులుగా గ్రీన్‌బెల్ట్‌లు
- వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో విశేష ఆదరణ



పిఠాపురం కాలనీ వద్ద గ్రీన్‌బెల్ట్‌లో నిర్మించిన వాకింగ్ ట్రాక్

మద్దిలపాలెం: జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్‌లు ఆరోగ్యం, ఆహ్లాదానికి నిలయాలుగా రూపుదిద్దుకున్నాయి. ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్‌లు రెండూ ఒకే చోట అందుబాటులో ఉండడంతో విశేష ఆదరణ పొందుతున్నాయి. జీ20 సదస్సులో భాగంగా హైవేకు మణిహారంగా ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతాలను ఆరోగ్య పార్కులుగా అభివృద్ధి చేశారు. శిథిలమైన ఫెన్సింగ్, చెత్తా చెదారంతో అధ్వానంగా దర్శనమిచ్చే ఈ గ్రీన్‌బెల్ట్‌లు పచ్చచెట్లతో కనువిందు చేస్తున్నాయి. ఇటు ఇసుకతోట నుంచి మద్దిలపాలెం వచ్చే మార్గంలో పిఠాపురం కాలనీ వద్ద గ్రీన్‌బెల్ట్ ఓ వైపు పచ్చని చెట్లతో కళకళలాడుతుంటే.. మరో వైపు



పిఠాపురం కాలనీలో ఓపెన్ జిమ్

వాకింగ్ ట్రాక్‌లో నడకదారులతో సందడిగా మారింది. మధ్యలో సేద తీరేందుకు వీలుగా సిమెంట్ బెంచ్‌లు కూడా చేశారు. కూత వేటు దూరంలో ఖాళీ స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు.

సాయంత్రం వేళ సందడే సందడి

భానుడి ప్రతాపానికి ఉదయం నుంచి బయటకు రాని వృద్ధులు, మహిళలు సాయంత్రం వేళ గ్రీన్ పార్కుల వద్దకు తరలివచ్చి సేద తీరుతున్నారు. పచ్చని చెట్లకు మువ్వన్నెల జెండాను తలపించేలా పెయింటింగ్ వేయడంతో చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రీన్‌బెల్ట్‌కు రక్షణగా ఫెన్సింగ్ పునరుద్ధరించి పెయింటింగ్ వేశారు. పార్కులోకి వెళ్లేందుకు గేటు కూడా ఏర్పాటు చేశారు.

ట్రాక్‌లలో జాగింగ్.. వాకింగ్

పిఠాపురం కాలనీ గ్రీన్‌బెల్ట్‌ను చదును చేసి రెండు మీటర్ల వెడల్పు, 640 మీటర్ల పొడవుతో వాకింగ్



గ్రీన్‌బెల్ట్ వద్ద ఏర్పాటు చేసిన బెంచీలపై కూర్చుని సేదతీరుతున్న స్థానికులు

ట్రాక్ సిద్ధం చేశారు. కాంక్రీట్‌తో ట్రాక్ నిర్మించి మధ్యలో గ్రావెల్ పరిచారు. నడవడానికి వీలుగా దీనిపై మెత్తని క్రషర్ బుగ్గిని వేశారు. వాకింగ్ చేసిన వారు కాసేపు సేదతీరేందుకు పార్కు మధ్యలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ర్యాలీ

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు దత్తత తీసుకున్న గ్రామాల్లో సామాజిక సమస్యలపై ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ యూనిట్లు దత్తత గ్రామాల్లో సమస్యలపై సామాజిక, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, మత్తు మందుల వాడకం వల్ల కలిగే అనర్థాలు, మద్యపాన నిషేధం, పౌష్టికాహార విలువలు, బాలిక విద్య, మనభూమి-మన బాధ్యత అంశాలపై అవగాహన కల్పించారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వి.రత్నభారతి, పోలా ఉమామహేశ్వరరావు, వి.సుధీర్, సామ్యూల్ డేవిడ్‌రాజ్‌లు నేతృత్వం వహించారు. ఈ ర్యాలీలో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డా రాజీవ్ పార్కు!

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-6లో రాజీవ్ పార్కు ఆకతాయిలకు అడ్డాగా మారింది. స్థానికుల అవసరాల కోసం జీవీఎంసీ ఈ పార్కును అందుబాటులోకి తెచ్చింది. రూ.లక్షలు ఖర్చు చేసి ఈ పార్కులో సౌకర్యాలు కల్పించింది. అయితే పార్కులో ఎటు చూసినా ఖాళీ మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. రాత్రి పూట ఆకతాయిలు ఇక్కడ మద్యం సేవించి బాటిళ్లను పార్కులోనే పడేస్తున్నారు. దీంతో కొద్ది సేపు సేదతీరుదామని పార్కుకు వచ్చిన స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి పార్కుకు ప్రత్యేకంగా వాచ్‌మన్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.



పార్కులో తాగి పడేసిన ఖాళీ మద్యం సీసాలు

కాకి ఒకటి నీళ్లకు..



జూలో అడవి దున్నలు ఎన్‌క్లోజరులో ఏర్పాటు చేసిన కుండీలో నీటిని తాగుతున్న కాకులు

ఆరిలోవ: ఈ ఫొటోలో నీరు తాగుతున్న కాకులను చూస్తే చిన్నప్పుడు ఒకటో తరగతిలో చదువుకున్న 'కాకి ఒకటి నీళ్లకు కావు, కావు మనుచును' అనే పాట గుర్తుకొస్తుంది కదూ. ఇందిరాగాంధీ జూ పార్కులో అడవి దున్నలు, కనుజులు, జింకలు ఎన్‌క్లోజర్లలో నీటి కుండీలు ఏర్పాటు చేశారు. వాటిలో రోజూ నీరు పోస్తుంటారు. ఆ నీటిని అవి తాగి దాహం తీర్చుకుంటాయి. ఇది సాధారణం. మరో విషయం ఏమిటంటే వేసవి ఎండ కారణంగా ఎక్కడా నీరు దొరకక అల్లాడుతున్న కాకులు కూడా ఎన్‌క్లోజర్లలో ఏర్పాట చేసిన నీటి కుండీలపై వాలి గొంతు తడుపుకొంటున్నాయి. ఇలా ఆదివారం రెండు కాకులకు నీటి కుండీ కనిపించేసరికి దాహం తీర్చుకుని తుర్రుమన్నాయి.

అన్నమాచార్య కీర్తనల పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ఎంవీపీ కాలనీ: అన్నమాచార్య కీర్తనల పోటీల వాల్ పోస్టర్‌ను శ్రీత్రిదండి చినజీయర్ స్వామీజీ ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లో ఆదివారం జరిగిన ఓ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్వామీజీ పాల్గొన్నారు. ఈ మేరకు శృతిలయ ఆధ్యాత్మిక సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అనమాచార్యుల జయంతి సందర్భంగా అన్నమాచార్య కీర్తనల పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సంస్థ ప్రతినిధులతో కలిసి స్వామీజీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రభాకర్, ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చినజీయర్ స్వామీజీ

పుస్తకం.. మంచి నేస్తం

మురళీనగర్: పుస్తకాన్ని మించిన నేస్తం మరొకటి ఉండదని విశాఖ జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. మనం తలదించుకొని పుస్తకాన్ని చదివితే మనల్ని తలెత్తుకుని జీవించే విధంగా ధైర్యాన్ని ఇస్తుందని చెప్పారు. ధన సంపద కన్నా.. జ్ఞాన సంపద గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ఒక పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు



పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న దత్తి అప్పలనాయుడు

చెప్పి, వాటిని చదివించారు. పిల్లలకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.పద్మజ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పెద్దిపాలెం వద్ద ఘోర ప్రమాదం

ఆనందపురం : మండలంలోని పెద్దిపాలెం ఆరు లైన్ల రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు వాహన చోదకులు ప్రాణాపాయం నుంచి బయటపడగా, కార్లు ధ్వంసమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. విశాఖ వైపు నుంచి తగరపువలస వైపు వెళ్తున్న కారు అకస్మాత్తుగా ఎడమ వైపు తిప్పగా దాని వెనుక నుంచి వెళ్తున్న మరో కారు డ్రైవర్ కంగారు పడి కారుని కుడి ఎడమ వైపులకు తిప్పి తప్పించుకొని వెళ్లిపోయాడు. దాని వెనుక వస్తున్న ఇంకొక కారు డ్రైవర్ ఈ సంఘటన చూసి కంగారుపడి కారుని అదుపు చేయలేక



పెద్దిపాలెం ఆరు లైన్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కార్లు

మొదట ఎడమ వైపు మళ్లిన కారునే వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ముందున్న కారు గాల్లోకి లేచి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఢీకొన్న కారు రోడ్డు అంచున ఢీకొని నిలిచిపోయింది. కాగా ఈ సంఘటనలో కార్లని నడుపుతున్న వారికి స్వల్ప గాయాలు కాగా ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కార్లు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు. దీంతో పూర్తి వివరాలు తెలియరాలేదు.

బాధిత బాలునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సన్యాసిరావు

దాబాగార్డెన్స్: బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిదేళ్ల బాలుడు సారిక కృష్ణకుమార్‌కు మోర్ప చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మోర్పా సన్యాసిరావు ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సన్యాసిరావు భార్య అనూషరాణి, నీలాపు సర్వేశ్వరరెడ్డి, అజయ్‌రెడ్డి, మాదాబత్తుల రమేష్, సారిపల్లి సంతోష్, కమలాకర్‌రెడ్డి, గోవింద్, మధు, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ

సీతంపేట: కథకులు తమ చుట్టూ ఉన్న సమాజం నుంచి కథా వస్తువును తీసుకున్నంత కాలం తెలుగు కథలోని తెలుగుదనానికి కీడు వాటిల్లదని కవి, వైద్య నిపుణుడు ఈదర పెద వీర్రాజు అన్నారు. ఎస్.కె.బాబు సంపాదకత్వంలో 56 మంది రచయితల 56 కథల సంకలనం కథా పరిమళాలు పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అడపా రామకృష్ణ సభాధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు విభాగాధిపతి మరడాన సుబ్బారావు, ఎస్.హనుమంతరావు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారి డి.శ్రీహరిరాజు, మేడా మస్తాన్ రెడ్డి, సర్వేశ్వరశాస్త్రి, శిరేల సన్యాసిరావు, పరమేశ్వరరావు, చిన్ని రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన చిన్నారుల కూచిపూడి జానపద నృత్యాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. నగరంలోని సిద్ధేంద్ర నాట్యాలయంలో శిక్షణ పొందుతున్న బాల కళాకారులు కనువిందుగా నృత్యం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమం ముందుగా బ్రహ్మమొక్కటే కీర్తనతో ప్రారంభమయింది. కళాకారులు మౌనిక, సంజన, కుషాల్, కోమల్ చంద్, రాఘవ, భాషిత, అక్షర, కీర్తి, శిరీష, తనూజ, నృత్య దర్శకురాలు సి.మోహనలక్ష్మి పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ నేతలు వంశీకృష్ణ, అక్కరమాని

మద్దిలపాలెం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల పిలుపునిచ్చారు. నగరంలో యాదవ సంఘం నాయకుల, పార్టీ కార్పొరేటర్లతో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖలో యాదవ సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి సముచిత స్థానం కల్పించారన్నారు. కీలకమైన నగర మేయర్, ఎమ్మెల్సీ, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ పదవులతోపాటు, జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో యాదవులకు అధిక సీట్లు కేటాయించారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తదితరులు

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి అంకితభావంతో పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రిగా మరోసారి జగనన్నను గెలిపించుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు అక్కరమాని వెంకటరావు, నాయకులు, కార్పొరేటర్ల, సంఘం నాయకులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆరిలోవ: యోగాతో ప్రతి మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆనంద్‌మార్గ్ ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవధూత తెలిపారు. ముడసర్లోవ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఆదివారం ఉచిత యోగా శిబిరం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో వాకర్స్ క్లబ్ సభ్యులతో పాటు స్థానికులు వివిధ యోగాసనాలు నేర్చుకున్నారు. ఈ సందర్భంగా సౌమ్యానంద్ అవధూత మాట్లాడుతూ యోగాలో ఏ ఆసనం వల్ల ఎలాంటి ఉపయోగం కలుగుతుందో వివరించారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పులు, పరిస్థితుల కారణంగా మనిషికి కలుగుతున్న ఒత్తిడి, అనా



ముడసర్లోవ వద్ద ఓపెన్ జిమ్‌లో యోగాపై అవగాహన కల్పిస్తున్న సౌమ్యానంద్ అవధూత

రోగ్యం కుదుటపడడానికి యోగా సాధన మంచి ఔషధం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మూర్తి, సభ్యులు ఈశ్వరరావు, వీర్రాజు, శంకరరావు, బాలరాజు, శ్రీను, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థో వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ 13వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హెల్త్‌సిటీలో జీజే ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆరిలోవ కాలనీ, పాండురంగాపురం, ఆపరేషన్ కాలనీ, కనకమహాలక్ష్మినగర్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 100 మంది వృద్ధులు, మహిళలకు ఆర్థోపెడిక్ సమస్యలపై వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ కీళ్ల, ఎముకల నొప్పులతో బాధపడుతున్న వారు ఎలాంటి జాగ్రత్తలు



వైద్య శిబిరంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ ఎల్.అరుణ్‌కుమార్, వైద్య సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పాండ్రంకి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎస్.ఈశ్వర్‌రావు, సబ్బవరపు శ్రీరామమూర్తి అనే ఇద్దరు వ్యక్తులు నగరంలోని ఆరిలోవలో నివసిస్తున్నారు. వీరు కార్పెంటర్ పని చేస్తుంటారు. వీరిద్దరు ఆదివారం ఉదయం సింహపురి కాలనీలో పనిచేయడానికి యాక్టివా స్కూటీపై ఊర్వశి జంక్షన్ నుంచి బిర్లా కూడలికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. వారు పాత్రా ఇండియా కంపెనీ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఒడిశాకు చెందిన లారీ ఢీకొనడంతో డ్రైవ్ చేస్తున్న శ్రీరామమూర్తి తలకు గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న ఈశ్వర్‌రావుకు చిన్న చిన్న గాయాలవడంతో వారిద్దరిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీరామమూర్తి

'తొలగించిన సిలబస్‌ను పునరుద్ధరించాలి'

మద్దిలపాలెం: ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో 10, 12 తరగతుల పుస్తకాల నుంచి తొలగించిన చరిత్రకు సంబంధించిన ముఖ్య పాఠ్యాంశాలను వెంటనే పునరుద్ధరించాలని సౌత్ ఇండియా అలియన్స్ ఫర్ ఫండమెంటల్ రైట్ టూ ఎడ్యుకేషన్ రాష్ట్ర కన్వీనర్ నవర ప్రకాశరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు లేఖ రాశానని పేర్కొన్నారు. గాంధీజీకి చెందిన పాఠ్యాంశాన్ని తొలగించారని, దీనికి కారణాలు తెలపలేదన్నారు. రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను కేంద్ర జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా కేంద్ర ఆధీనంలో కేంద్రీకరించే దిశగా అడుగులు వేస్తున్నారని, ఇది సరైన ధోరణి కాదన్నారు. ఏపక్షంగా నూతన విద్యా విధానాన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది విద్యావ్యవస్థను నాశనం చేసేలా ఉందన్నారు. సమైక్య విద్యా వ్యవస్థ విధానాన్ని రూపొందించాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

దాబాగార్డెన్స్: ఎంటీఆర్ సినీ సాంగ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు ఎం. త్రినాథరావు నేతృత్వంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయకులు ఎం.త్రినాథరావు, జ్యోతి, ఎమ్మెస్ మాధవ్, అంబిక, ఎస్ఎస్ఎన్ రాజు, నాగలక్ష్మి, డాక్టర్ కేఎల్ రావు, లయ, నిహారిక, ఎస్. రాజేశ్వరి పలు చిత్ర గీతాలు శ్రావ్యంగా పాడి ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సుందర్‌వడ్డీ, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు



చిత్ర గీతాలు ఆలపిస్తున్న గాయకులు

సన్‌మూర్తి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, న్యాయవాది బర్ల పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యుల నూతన కార్యవర్గం

మహారాణిపేట : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్ వైద్యుల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.బి.కె. సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ రావుల సమక్షంలో 2023-25 సంవత్సరాలకు గాను ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా డాక్టర్ పి.రాఘవేంద్ర రావు, కార్యదర్శిగా డాక్టర్ రాజా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.శివకాంతి, నిరంతరం వైద్య విద్యల కన్వీనర్‌గా డాక్టర్ వి.హేమలత, కోశాధికారిగా డాక్టర్ ఎస్. సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ ఆర్. నర్మదా మానస, డాక్టర్ వి.లక్ష్మీపతిరాజు, డాక్టర్ హెచ్.చాందినీశ్రీ,, డాక్టర్ బి.వి.అభిలాష్, డాక్టర్ సౌజన్య, లేడీ డాక్టర్ల రిప్రజెంటేటివ్‌గా డాక్టర్ బి.శ్రీలిఖిత ఎన్నికయ్యారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
✆ 7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
✆ 9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com